# హూదీమందు
# (లేక) మళ్ళీ మరోహత్య

కొందరు రచయితలు చాలా క్రూరులు, దుర్మార్గులు. వాళ్ళు అవలీలగా హత్యలు చేసేస్తుంటారు. మనుషుల్ని చంపేస్తుంటారు. ఈలోకంలో హత్యలు చేసినవారికంటె క్రూరులూ, దుర్మార్గులూ ఎవరూ ఉండరుకదా? ఎవడైనా గొప్ప తెలివితేటలుగల మేధావి, తన చాకచక్యాన్నీ, బుద్ధి బలాన్నీ ఉపయోగించి, అన్ని దారులూ మూసేసి మరొకణ్ణో, లేక మరొక తరగతి మనుష్యులనో గుప్పిటలో ఉంచుకుని నానాహింసలూ పెడుతున్నాడనుకోండి. అవతలి వాడి బలహీనత, లేదా వాడి పిలక (అంటే పరువు ప్రతిష్ఠలూ, తిండీతిప్పలూ, వంశగౌరవాలూ; బ్రతుకు తెరువులూ, వగైరాలన్నమాట) తన చేతిలో దొరకబుచ్చుకుని వాణ్ణి డబ్బుకోసమో, మరెందుకోసమో నిరంతరం హింసించే తరగతి మనుషులున్నారు. వాళ్ళ జీవితం 'మహారాజు' లాగా వెళ్ళమారిపోతుంది. జీవితం సినిమాకథలా

గుండదుకదా? సినిమా కథల్లో మామూలుగా నిరంతరం కథానాయకుడే గెలుస్తూఉంటాడు. వాడు చావడు. కాని జీవితంలో అలాకాదు. దుర్మార్గులే ఎల్లప్పుడూ సుఖపడుతూ ఉంటారు. ఎదుటివారి మానప్రాణాలనూ, కండబలాన్నీ, శ్రమనూ, అన్నింటినీ పీల్చి పిప్పిచేస్తూ హాయిగా వేసవి కాలంలో చల్లగా, చలికాలంలో వెచ్చగా కోరినవన్నీ అనుభవిస్తూ 'జీవిస్తూ' వుంటారు. వారికోసం నిర్భాగ్యులు కొందరు నిరంతరం ఎండాకాలంలోనూ నిప్పులు చెరిగే ఎండ లోనూ, చలికాలంలో ఎముకలు కొరికే చలిలోనూ, వంచిన తలలూ నడుములూ ఎత్తకుండా పనిచేస్తూ జీవితాన్ని 'ఈడుస్తూ'వుంటారు రచయితలు హంతకులన్నానుకదా! దానికి కారణంవుంది. ఒకరచయిత ఒక పాత్రను సృష్టిం చారనుకుందాం. దాన్ని నడిపించి నడిపించి తన యిష్టం వచ్చి నప్పుడు 'మర్డర్' చేసేస్తూవుంటాడు. ఇది రచయితల'ట్రిక్కు' లలో ఒకటి. పాత్రలను చంపేయడం, అందుమూలంగా పాఠ కులలో సానుభూతినీ, కన్నీటినీ కొల్లగొట్టడం—ఇది మంచి ట్రిక్కు. ఈ ట్రిక్కులో నమ్మకం ఉన్న రచయితలు కొంద రున్నారు. వారు అవసరమనుకుంటే కొన్ని పాత్రలను చంపే స్తుంటారు. కొందరికి యీట్రిక్కు అంటే కోపం. రచయిత ఆ పాత్రను చంపకపోతే నేం? 'హాయిగా పదికాలాలపాటు అలాగే జీవితాన్ని బలవంతంగా ఈడ్చినట్టువ్రాయకూడదా?' అంటారు. వారికి జాలి ఎక్కువ. ఎవరైనా, కథల్లో అయి

తేనేం, చావడం సహించరు. అది వారి 'మానవత'కు నిదర్శనం. కాని లోకంలో పరిస్థితి అలా లేదు. కొందరు నిరంతరమూ నలిగిపోతూనే వుంటారు. వారికష్టం ఒకనాటితో ఒక ఏటితో అయ్యేదికాదు. వారి ఆదాయం పెరిగేదికాదు. వారి సమస్యలు తీరేవికావు. వారికన్నీళ్ళు ఆగేవీకావు. వారిజబ్బులూ, ఆకలీ ముగిసేవికావు. ఎందరో నిరంతరం దుఃఖిస్తూవున్నారు. ఎందరో పళ్ళబిగువున దుఃఖాన్ని ఆపుకుంటున్నారు. ఎందరో కన్నీళ్ళకు బలవంతాన ఆనకట్టలు కట్టుతున్నారు. మరెందరో నిరంతరం చస్తూనేవున్నారు. ఒకడెవడో చిన్న 'సెంటిమెంటు'తో చిన్న కారణానికి చచ్చిపోతాడు. మనకు సానుభూతి లేదు. ఒకడెవడో చిన్నకోరిక తీరక, చిన్న సమస్యను ఎదుర్కొనలేక, గుటుక్కుమంటాడు. వాడు బలహీనుడు కాబట్టి వాడి ప్రాణానికెంత కావాలి? క్షణంలో పోతుంది. అలా రోజూ చచ్చేవారిని గురించి, జీవచ్ఛవాలవలె బ్రతుకులు 'ఈడ్చే' వారినిగురించి మనకక్కర లేదు. మనం ఆలోచించం. ఎవడైనా దేశంకోసం ప్రాణాలర్పిస్తే, మనం కదలిపోతాం. వాడిచావుకు విలువయిస్తాం. వాడి విగ్రహాలు రోడ్లమీద ప్రతిష్ఠిస్తాం. వాడి ఫొటోలు ఇళ్ళలో ఉంచుకుని పూజిస్తాం. వాడిది 'మరణం.' అంతేగాని ఎవడో బలహీనుడు ఒక చిన్న సెంటిమెంటుకోసం చిన్న ఇబ్బందికి గురై చస్తే వాణ్ణి గురించి ఎందుకు బాధపడ

తాం? అలాటి మామూలువాడు పోతే అది కేవలం 'చావు' మాత్రమే!

లోకాన్ని గురించి వ్రాసే రచయిత ఈ చావులను గురించీ వ్రాయవలసి వస్తుంది. కేవలం 'మరణాలను' గురించి వ్రాస్తే చాలదు. మన చుట్టూ వున్న సమాజంలో అడుగున పడిపోయి నిరంతరం 'చస్తున్న' వారిని గురించి కూడా ఆలోచించాలి, వ్రాయాలి. తప్పదు. నువ్వు నీ చుట్టూ నేడున్న వాస్తవ పరిస్థితిని చూచి అర్థంచేసుకుని వ్రాయడం అంటే కష్టాలు పడుతున్న వారిని గురించి, కష్టాలు పడి పడి ఛస్తున్న వారిని గురించి, వ్రాయడమన్న మాట. వారి కన్నీటిగాధ అంతాచెప్పి "అయ్యో పాపం! ఇన్ని కష్టాలు పడ్డాడు, ఇంకా వాణ్ణిచంపి పాపం కట్టుకోడం దేనిక"ని దయతో ఊరుకోకు. అన్ని కష్టాలు పడేవాడు చావడమే వుచితం. ఆ పాత్రను చంపెయ్యడం న్యాయం. చావవలసిన వాణ్ణి బ్రతికించేందుకు నువ్వెవడివి? అసలు చంపేవాడు, చంపబడేవాడు. అంతా పెద్ద మాయ కదా?

* * *

వాడిపేరు రాజు... బాలరాజు.

వాడి ఎదురుగా ఒక పెద్ద పళ్ళెంవుంది. దానిలో వేయించిన వేరుశనక్కాయలున్నాయి. వాడు సినిమాహాలు ముందు వున్నాడు. వాడికివ్వాళ జనం ఇంటర్వెల్ లో బయ

టికి వచ్చే గేటుముందు చేరానికి బాగా అనువైనచోటు దొరకలేదు. వాడక్కడికి వచ్చేసరికి ఆలస్యమైపోయింది. అందువల్ల హాలు గేటుకు దూరంగా, ఇద్దరు సోడా బండి వాళ్ళ మధ్యలో కూలబడవలసి వచ్చింది.

వాళ్ళ నాన్న బతికున్నప్పుడు వాణ్ణి చూసుకొని ఎంతగానో మురిసిపోయేవాడు. వాళ్ళ అమ్మ వాణ్ణి చూసుకొని పొంగిపోయేది. ఇప్పటికీ ఆమె వాణ్ణి చూసుకొని పొంగిపోతూనే వుంది. దాదాపు పన్నెండేళ్ళ క్రిందటవాడు పుట్టిననాడు (ఆ తేదీ, తిథి వగైరాలు వాళ్ళ అమ్మకే గుర్తులేవు, ఇక వాడికేం తెలుసు!) సూర్యుడు మామూలుగానే తూర్పున ఉదయించాడు.పడమట అస్తమించాడు. అది వర్షాకాలం కాబట్టి కొద్దిగా చినుకులు పడ్డాయి. ఆ రాత్రికి మబ్బులు విడిపోయినప్పుడు, వెన్నెల రోజులు కాబట్టి కొద్దిగా వెన్నెల వచ్చింది. ఆ వెన్నెల కిరణాలు పాక పైకప్పు రంధ్రంలోనుంచి ఆ పసిగుడ్డుకు కొంచెం దూరంలో సున్నాలాగ పడ్డాయి. అంతకుముందు వర్షం చినుకులుకూడా ఆ రంధ్రంలో నుంచే పడ్డాయి. ఆరోజున కూడా ఆ చుట్టు పక్కల గుడిసెలలోవాళ్లు, ఉన్నవాళ్లు తిన్నారు, లేనివాళ్లు లేదు. పక్క పాకలో అప్పలస్వామి మామూలుగా రిక్షా వేసేందుకు పోయాడు. మరో పాకలో రంగయ్యా కూతుళ్ళిద్దరూ బాగా ప్రొద్దుగూకగానే రోజూవలెనే 'లాడ్జింగుకు' వెళ్ళిపోయారు. రంగయ్యా రోజూ ఎలెనే ఒంటరిగా వాకిట్లో

కూర్చుని చుట్టకాల్చుకున్నాడు. మరో వైపు పాకలో రోజూ వలెనే మామా కోడళ్ళ గొంతులు రాపాడేలా ఒకరిమీద ఒకరు మాటల యుద్ధం చేసుకున్నారు. చివర ఉన్న కల్లు పాకలో రోజూవలెనే మనుషులు చేరారు. అక్కడ రోజూ వలెనే 'మందు' చెల్లిపోయింది. అంతటా, అంతా మామూలుగా ఉంది. కాకపోతే మాణిక్యం పచ్చి బాలింతరాలు కావడంచేత ఆ రోజునా, తర్వాత రెండు రోజులూ కూడా కలవారి యిళ్ళలోకి పని చేసేందుకు వెళ్ళలేకపోయింది. తర్వాత ఎలాగూ తప్పలేదనుకోండి... ఈ వివరాలను బట్టి చూస్తే ప్రపంచంలో, లేదా కనీసం ఆ వూళ్లో బాలరాజు పుట్టిన రోజున అంతా మామూలుగానేవుంది. ఎక్కడా ఏ విపరీతమూ జరగ లేదు.

అలా భూమ్మీదపడ్డాడు బాలరాజు. అతని తండ్రి అతను పుట్టినవేళకు ఇంట్లో లేడు. మిల్లులో ఆ సమయానికి బస్తాలు మోస్తున్నాడు. అప్పుడతన్ని గుర్తుపట్టడం కష్టం. అప్పుడతని మొహం, కాళ్ళూ, చేతులూ అంతా తెల్లని కోటా వేసుకున్నట్టుగా వున్నాడు. పనిచేసి చేసి, బస్తాలు మోసి మోసి అతడు నీరసంగా నడుచుకుంటూ ఇంటికి వచ్చే సరికి ఈ వార్త తెలిసింది. అతని నల్లని ముఖం కాస్సేపు కళకళలాడింది. ఎన్నడూ మెరుపెరుగని మామూలు కళ్ళు అప్పుడు తళుక్కున మెరిశాయి. మనిషి ఆనందంతో

గర్వంతో తల మునకలైనాడు. లోపలికి వెళ్ళి మెరుస్తున్న కళ్ళతో చూశాడు. భార్య నీరసంగా పడుకునివుంది. పక్కనే పొత్తిళ్ళలో పసిగుడ్డు... మాణిక్యం మొగుణ్ణిచూసి నీరసంగా నవ్వింది. అతడు అంతకుముందే చాలసార్లు అనుకున్నాడు. భార్యతో ఎన్నోసార్లు అన్నాడు కూడా. మగపిల్లవాడు పుడితే వాడిపేరు బాలరాజు. ఆడపిల్ల పుడితే ఆ పిల్లపేరు 'ఘణసుందరి'. ఇప్పుడు మగపిల్లవాడు పుట్టాడు కదా? వాడి పేరు బాలరాజు...

బాలరాజుకు ఎనిమిదోయేట వాడి నాన్న పోయాడు. మిల్లులో ఆరోజు పనిచేస్తూ మరీ చచ్చిపోయాడు. మధ్యాహ్నం రెండు గంటలవేళ టీ నీళ్ళు తాగి వచ్చి ఒక క్షణం కూర్చుని మళ్ళీ పనిలోకి దిగాడు. బస్తా వీపుమీది కెత్తుకున్నాడు. రెండడుగులు వేశాడు. 'అమ్మా' అన్నాడు. బస్తా క్రిందపడేసి కూలబడిపోయాడు. నలుగురూ చేరి చూశారు. అతడు గుండె పట్టుకొని మళ్ళీ రెండు సార్లో, మూడుసార్లో 'అమ్మా' అన్నాడు. నలుగురూ చేరి అతన్ని ఇంటికి చేర్చారు. మాణిక్యం అప్పటికి ఏ కలవారి లోగిలి లోనో పనిలోవుంది. విషయం తెలిసి పరుగెత్తుకువచ్చి బావురుమన్నది. మొగుడి పక్కనే కూర్చుని నిశ్శబ్దంగా ఏడ్చింది. తెలిసిన దేవుళ్ళందరికీ పేరు పేరునా దణ్ణాలు పెట్టింది. అతని పరిస్థితి ఏమీ బాగాలేదు. మూసిన కళ్ళు తెరవకుండా మూలుగుతున్నాడు. రాత్రి ఎనిమిది గంటల

వేళకు రెండుసార్లు సూదిమందు యివ్వడం జరిగింది. 'రాత్రి గడిస్తే ఫరవాలేద'ని ఆ చిన్న డాక్టరు వెళ్ళిపోయాడు. మాణిక్యం మొగుడిపక్కనే కూర్చున్నది. బాలరాజు మరో పక్క కూర్చున్నాడు. మొగుడి మూలుగు ఆగిపోతే మాణిక్యానికి గుండె దడదడలాడేది. ఆ మూలుగే అతడు బ్రతికి ఉన్నాడనడానికి ఋజువు. అది కాస్తా ఆగిపోతే ఎలా? ఆ రాత్రి గడవాలి. అంటే తెల్లవారేవరకూ అతడు మూలుగుతూ వుంటే చాలు. గట్టెక్కినట్టే. ఆపూట మాణిక్యం తిండి ఏమీ తినలేదు. కొడుకును తినమంటే వాడు కూడా తినలేదు. అలాగే తండ్రి తలవైపున కూర్చున్నాడు బాలరాజు. చాలా రాత్రి గడిచేసరికి బాలరాజుకు నిద్ర వచ్చింది. ఆమె అలా మేలుకునేవుంది. ఉండి ఉండి మూలుగుతున్న పెనిమిటికి పమిటకొంగుతో విసురుతూ కూర్చుంది. అర్ధరాత్రి దాటిన తరువాత అతని మూలుగు ఆగిపోయింది. మరి వినరాలేదు. మాణిక్యం మొగుడి కాళ్లూ, చేతులూ పట్టుకొని చూసి, తెరచుకొని ఉన్న కళ్ళను చూసి 'దేవుడో' అని శోకాలు ప్రారంభించింది. బాలరాజు ఉలిక్కిపడి మేలుకొని తానుకూడా ఏడవటం సాగించాడు.

అలా బాలరాజు తండ్రిపోయాడు. అదివాడికి యిప్పటికీ బాగా గుర్తు. ఆతర్వాత కొన్ని రోజులకుగాని మాణిక్యం మామూలు మనిషి కాలేదు. మనిషి అయిన తర్వాత

కూడ ఆమెలో మునుపటి కళాకాంతులు రాలేదు. ఏదో, కన్నుమూసేవరకూ బతకక్క తప్పదు కాబట్టి బతుకుతున్న దానిలా వుంది. అయితే ఆమెకు కొడుకు సర్వస్వం అయినాడు. వాణ్ణి చూసుకునే ఆమె బతుకుతున్నది.

* * *

బాలరాజు రకరకాల పదార్థాలు అమ్ముకుంటున్న వారిలో చాలా చివరన ఉన్నాడు. వాడివాళ సినిమా హాలుకు కొంచెం ఆలస్యంగా వచ్చాడు. అప్పటికే అక్కడ పోటీ తీవ్రంగావుంది. సోడాబండివాళ్లూ, జిలేబీలు స్వీట్ల వాళ్లూ, జంతికలవాళ్లూ, మొక్కజొన్న పొత్తులవాళ్లూ, అందరూ ఎవరి పాటికివారు అనువైనచోట్లు ఆక్రమించుకుని ఉన్నారు. ఆ హాల్లో ఏదో ఇంగ్లీషు సినిమా. ఇంటర్వెల్ ఇతర హాళ్ళలో కంటె కొంచెం ముందుగా అవుతుంది. ఈ హాలుకు అనేక రకాలవాళ్ళు వస్తారు. ఇంగ్లీషు సినిమాలు చూడటం గొప్ప అనుకునేవారూ, ఇంగ్లీషు అర్థం అయ్యేవారూ, కానివారూ, నగ్నపు బొమ్మలకోసం వచ్చేవారూ, తెల్ల చొక్కాలవారూ, లారీలమీద పనిచేసేవారూ, మెకానిక్కులూ, ఆంగ్లో ఇండియనూ, అందరూ వస్తారు. హాలులోపల పాప్ కారన్లూ, జీడిపప్పు పొట్లాలూ, సోమాసోలు, టీలు, డ్రింకులు బాగా చెల్లుబడి అవుతూ వుంటాయి. బయట కూడా కాస్తో కూస్తో. వ్యాపారం సాగు

తూనే వుంటుంది. అందరిలోకీ పచ్చి మిరపకాయ బజ్జీల వాడి వ్యాపారం ఉత్తమం. వాడితో పోటీ సోడాల వ్యాపారం కూడా. తర్వాత గరంగరం మసాళావారి వ్యాపారం... తర్వాతనే వేరుశనక్కాయల వ్యాపారం...

బాలరాజు దిగులుగా వున్నాడు. పళ్ళెంలో నిన్నటి వేరుశనక్కాయలు, చిల్లరగా అమ్మితే రెండు రూపాయల పైన ఖరీదు చేసేవి, ఉన్నాయి. వాడి జేబులో కొంత చిల్లర వుంది. దాన్ని యిప్పుడు యివతలకితీసి లెక్కపెడదా మనుకున్నాడు గాని, అలా చేయలేదు. ఎంత లెక్కపెట్టినా రూపాయిపైన చిల్లర పైసలు ... ఎందుకు మళ్ళీ మళ్ళీ లెక్కపెట్టడం?

వాడిజేబులో చిల్లరతోపాటు ఒక చీటివుంది. ఆ చీటి మీద వాడు అత్యవసరంగా కొనవలసిన సూదిమందు వ్రాసి వుంది. దాని ఖరీదు దాదాపు రెండున్నర ... అంటే వాడి తల్లి ప్రాణం ఖరీదు రెండున్నర...

* * *

మాణిక్యం అయిదారు రోజులుగా మంచాన పడింది. మంచం అంటే నిజంగా మంచం కాదనుకోండి, చిరుగుల చాపమీద పడివుంది. అయిదారు రోజులనుంచీ ఫెళ్ళున జ్వరం... జ్వరంలో పిచ్చిమాటలు... పలవరింతలు. మూలుగులు...

బాలరాజు తల్లిని సాయంకాలం సర్కారాసుపత్రికి తీసుకుపోయాడు. రిక్షాకోసం ముప్పావలా ఖర్చయిందే తప్ప మరేం జరగలేదు. "టైమయిపోయింది. ఇక చచ్చిపోయే వారికైనాసరే, ప్రాణంపోతున్న వారికైనాసరే, బ్రతికించడానికి వీలున్నాసరే, చూడంపొమ్మని" గేట్లు మూసేశారు. ఆ గేట్లు పలుకుడి కలవారికిగాని, లేక కలవారికిగాని, డబ్బువాసనవేస్తే ఎప్పుడయినా తెరుచుకుంటాయేమో తెలీదు. మాణిక్యంకోసం మాత్రం అవి తెరుచుకోలేదు. బాలరాజు ఎంత ప్రాధేయపడినా లాభం లేకపోయింది. వాడు ఉసూరు మంటూ తల్లిని తిరిగి అదే రిక్షాలో ఎక్కించుకుని యింటికి చేర్చాడు. రిక్షావాడి సాయంతో మళ్ళీ చాపమీద పడుకోబెట్టాడు. రిక్షావాడికి డబ్బులిచ్చి పంపించి, చాలాసేపు తల్లిపక్కన, తల్లి మొహంలోకి చూస్తూ కూర్చున్నాడు. తర్వాత వాడికి ఎందుకో ఏడుపు పొంగి వచ్చింది. కాస్సేపు ఒంటరిగా కూర్చుని ఏడిచాడు. అంతలో గుమ్మంలో పిలుపు వినిపించింది. చొక్కాతో కళ్ళు తుడుచుకుని లేచి చూస్తే అక్కడ రంగయ్య చుట్టముక్క విసిరి వీధిలో పారేసి, 'ఏరా! మీ అమ్మ కెలాగున్నది?' అంటూ వచ్చాడు. బాలరాజు ఏమీ మార్పు లేదన్నట్లు తల ఊపి చప్పరించాడు. రంగయ్య ఒక్క క్షణం ఆగి "మరి ఆసుపత్రికి, తీసుకెళ్లామా?" అని అడిగాడు. బాలరాజు అంతా చెప్పాడు. రంగయ్య అంతా విన్నాడు. విని, విని చివరకు నుదురు రుద్దు

కుంటూ "అయితే ఇక వచ్చెయ్యి...నాతో రా...ఆపైన ఒక డాక్టరు గారున్నారు. ఆరు మనబోటోల్లు పిలిస్తేకూడా వొస్తారు. శానామంచోరు. ఆరి నడుగుదాం...సూదిమందిస్తే తగ్గిపోతాది జొరం" అన్నాడు. ఆ డాక్టరుకూ, రంగయ్యకూ పెద్ద పరిచయం ఏమీ లేదు. ఉండేవీలు లేదు కూడాను. అయితేనేం, రంగయ్య అలా అనడంలో ఎంతో మంచితనం చూపించుకున్నాడు. బాలరాజు వెంటనే అతన్ని అనుసరించాడు. ఆ డాక్టరు మంచివాడిలా వున్నాడు. రోగుల్నీ, రోగిష్టివాళ్ళ అయినవారినీ పీక్కుతినే మనిషి లాగ కనిపించలేదు. ఆయన చాలా దయతో అంతా విన్నాడు. రంగయ్య ఆయనను 'పది అడుగులు' వచ్చి మాణిక్యాన్ని చూడమని అడిగాడు. ఆ డాక్టరు తీరిక లేదనీ, 'రాలేన'ని అనకుండా ఒక్క అయిదునిమిషాలలోనే బయలుదేరి వచ్చాడు. బాలరాజు పొంగిపోయాడు. వాడికి డాక్టరొక దేవుడిలా కనిపించాడు. గొప్ప ఆరాధనా భావం కలిగింది. మాటిమాటికి చెయ్యెత్తి ఆయనకు దణ్ణం పెట్టాలనిపించింది. ఆయన ఆ మురికి పేటలో, ఆ మురికిసందులలో, బురదలో ఏమీ సందేహించకుండా వారి వెంట నడిచి మరీ వచ్చాడు. తలవంచి పాకలోకివచ్చి రెండు మూడు నిమిషాల సేపు మాణిక్యాన్ని పరీక్షచేశాడు. తర్వాత తలవూపి "నీ పెళ్లాంపరిస్థితి ఏమీ బాగులేదు. అయినా..." అంటూ వుండగా రంగయ్య "అది నా పెళ్ళాం కాదండి.ఆడి తల్లి అండీ...

ఆడి తండ్రి పోయాడండీ..." అన్నాడు గబగబా. డాక్టరు "ఓహో!" అంటూ బాలరాజు వంకతిరిగి "అయితే ఒరే అబ్బాయ్! నా వెంటరా మందు రాసిస్తాను. ఇంజక్షను... తీసుకురా...మా కంపౌండరును పంపిస్తాను. అతనే ఇంజక్షనిస్తాడు." అన్నాడు.

"దాన్తో తగ్గుద్దాఅండీ?" అని అడిగాడు బాలరాజు.

"నిక్షేపంగా తగ్గుతుంది ... నువ్వేం దిగులుపడకు. అయితే కాస్త తొందరగా తీసుకురా మందు" అన్నాడు డాక్టరు, ఆయన కడుపుచల్లగా...

బాలరాజు డాక్టరు వెంట వెళ్ళాడు. ఆయన వ్రాసి యిచ్చిన మందు చీటీ తీసుకున్నాడు. దాన్ని భద్రంగా పట్టుకుని ఒక షాపులో ఖరీదు కనుక్కున్నాడు. రెండున్నర చెప్పారు. వాడు ఇంటికివచ్చి ఉన్న చిల్లర అంతా లెక్క పెట్టాడు. రూపాయిదాకావుంది. వెంటనే వీధిలోకి వచ్చాడు. దూరంగా రంగయ్య కల్లుపాకవైపు వెళ్తున్నాడు. అతన్ని ఇప్పుడడిగితే లాభంలేదు. ఉన్నా ఇవ్వడు. బాలరాజు చుట్టుపక్కల ఒకరిద్దర్ని అడిగి లేదనిపించుకుని చివరకు తన పాకలోకి వెళ్ళి చిల్లర అంతా జేబులో పోసుకుని వేరుశనక్కాయల పళ్ళెం అందుకుని నెత్తిమీద పెట్టుకుని గుడిసె గుమ్మం దాటుతూ మళ్ళీ తల్లివంక చూశాడు. ఆమె అలాగే కళ్ళుమూసుకుని పడుకునివుంది. వెంటనే చూపులు తిప్పు

కుని నెత్తిమీద పళ్ళెంతో దాదాపు పరుగు పెడుతూ సినిమా హాలు చేరుకున్నాడు.

*   *   *

సినిమా హాలుముందు లైట్ల వెలుతురులో అంతా పట్ట పగలులా వుంది. పైన పెద్ద పెద్ద బొమ్మలు ... ఎక్కువ ఆడవాళ్ళ బొమ్మలు...ఆ బొమ్మలకు దుస్తులు లేవు ... ఉంటే కొద్దిగా ఉన్నాయి. ఇద్దరు మగవాళ్ళ బొమ్మ లున్నాయి. వాళ్ళు బలంగా ఉన్నారు. వాళ్ళ చేతుల్లో పిస్తోళ్ళున్నాయి...

ఇంకా ఇంటర్వెల్‌కు కొంతవ్యవధి ఉన్నట్టుంది. బాల రాజు అప్పుడే అరవడం సాగించాడు. "వేపుడు శనక్కా యలు... వేపుడు శనక్కాయలు ... ఆంధ్రా జీడిపప్పు ... గాంధీ జీడిపప్పు..." అంటూ మొదలు పెట్టాడు. వాణ్ణి చూచి ఇతరులు కూడా అరవడం ప్రారంభించారు. మొత్తం మీద కొద్ది సేపట్లోనే అందరూ గొడవ గొడవగా రొదగా అరవడం మొదలు పెట్టారు.

లోపల బెల్లుమోగింది. వీళ్ళ గొంతుకలు కూడా పెద్దవయ్యాయి. అందరూ గొంతుకలు చించుకుని అరు స్తున్నారు. "సోడా సోడా", "తంపటకాయలు...తంపట కాయలు", "గరంగరం మసాళా ...", "ఇడ్లీ ఉప్మా", "జంతికలు, జంతికలు..."

జనం బిలబిలలాడుతూ ప్యాసులు తీసుకుని బయటికి వస్తున్నారు. సోడాలు 'ఖస్' మంటున్నాయి. బాలరాజు గొంతు యింకా పెంచాడు. ఆ పది నిముషాలూ అరుస్తూనే వున్నాడు. అరిచి అరిచి వాడిగొంతు బొంగురు పోయింది. రెండు పదిపైసల పొట్లాలు కట్టాడు. జనం అటూ యిటూ వెళ్ళిపోయారు. సోడాలు మాత్రం ఉండీ, ఉండీ శబ్దం చేస్తూనే వున్నాయి. వాడు అరుస్తూనే చుట్టూ చూశాడు. ఆ పచ్చిమిరపకాయ బజ్జీలవాడి బండిచుట్టూ జనం గుమిగూడి వున్నారు. వారికి ఊపిరి తీసుకునే వ్యవధి కూడా ఇవ్వకుండా జనం మూగివున్నారు. బాలరాజు వాడి చేతుల వంక అసూయతో చూశాడు. వాడి చేతులు గబగబా కదులుతున్నాయి. బజ్జీలు కాగితంలో వెయ్యడం, గబగబా పొట్లం కట్టడం... అందించడం ... మళ్ళీ కాగితం చేతిలోకి తీసుకోడం....

జనం పలుచబడ్డారు. ఎంతత్వరగా బయటికి వచ్చారో అంత త్వరగానూ లోపలికి వెళ్ళిపోయారు. ఇక సోడా బళ్ళవాళ్ళూ, చవక జిలేబీల వాళ్ళూ, జంతికలవాళ్ళూ పక్కసందువైపు కదిలారు. ప్రక్కనే సందులో మరో హాలులో తెలుగు సినిమా ఆడుతోంది. అక్కడ ఇంటర్వెల్ టైముకు అందుకోవాలి. అక్కడ గేటుముందే అనువైన చోటు చూసుకోవాలి.... బాలరాజు పళ్ళెం నెత్తికెత్తుకుని పరుగెత్తాడు.

ఆ సినిమాహాలు ముందు బాలరాజుకు అనువైన చోటు దొరికింది. అయితే ఏం? వాడిపక్కనే గరంగరం మసాలా వాడు చేరాడు. అటూ యిటూ సోడావాళ్ళు చేరారు. అదీగాక ఆ సినిమా చాలారోజుల్నుంచీ ఆడు తున్నందువల్ల జనం ఆట్టే ఎక్కువగా లేరు. బాలరాజు వ్యాపారం పెద్దగా ఏమీ సాగలేదు. ఎంత అరిచినా లాభం లేకపోయింది. చివరకు ఒక్కడుమాత్రం పది పైసల కాయలు కొనుక్కుపోయాడు. అక్కడ సద్దుమణగగానే బాలరాజు మళ్ళీ పళ్ళెం నెత్తికెత్తుకుని పరుగెత్తాడు. ఫర్లాంగు దూరం లోనే మరో హాలు ఉంది. వాడు పరుగెత్తుతూ పరుగెత్తుతూ దోవలో ఒకరిని ఢీకొట్టబోయి తమాయించుకున్నాడు. లేక పోతే పళ్ళెంలో కాయలన్నీ నేలపాలై పోయివుండేవి. అక్కడ హాలులో కొత్తసినిమా...అక్కడ అమ్మకం బాగా జరుగుతుందని అందరి ఆశ. బాలరాజూ, ఇతరులూ పోటీలు పడి మరీ పరుగులెత్తారు.

కాని అక్కడ వ్యవహారం ఏమీ బాగులేదు. హాలు ముందు పోలీసులు నిలబడి వుండి సోడాబండి వాళ్ళనూ, ఇతరులనూ, ఎవరినీ ఆ దరిదాపుల్లోకి రాకుండా చూస్తు న్నారు. వీధి చివర వీళ్ళందరూ ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడు కున్నారు. "ఏమిటి సంగతీ" అని అడిగాడొక సోడాబండి వాడు ఒక జంతికలవాణ్ణి ఆపి ఆయాసంతో వగర్చుతూ. వాడు 'ఎవరో పోలీసాఫీసరు సినిమా కొచ్చేడంట. ఇయాళ

ఈడ మనకుదుమ్మే...' అన్నాడు. మరొకడు ఉస్సురని నిట్టూర్చి 'పోలీసాయన సినిమాకొస్తే హాలు బయట మనం వుండ కూడదా?' అన్నాడు. 'ఉండకూడదంటే .... అది రూలు....' అన్నాడు మరొకడు.

బాలరాజు బొమ్మలా నిలబడిపోయాడు. మరో రెండు నిముషాల్లో ఇంటర్వెల్ అయింది. జనం బయటికి వచ్చారు. కాని, వీధి చివరివరకూ వచ్చి ఈ తినుబండారాలు కొన్న వాళ్ళు బాగా తక్కువమంది. మరో పది నిముషాల్లో ఆ తంతుకూడ పూర్తి అయింది. జనం పలుచబడి పోయారు. సోడావాళ్ళ కేకలు తగ్గిపోయాయి. కొన్ని పళ్ళేలముందు కిరసనాయిలు దీపాలు వెలుగుతున్నాయి. పోలీసు లింకా అక్కడే నిలబడివున్నారు. వాళ్ళ చేతులలో లాటీ లున్నాయి.

బాలరాజు పళ్ళెంలో వేరుశనక్కాయలు ఒక కుప్పగా సర్దాడు. తర్వాత ఎదురుగా వాడి చూపు నిలిచి పోయింది. ఒకషాపు .... ముందు పెద్ద అక్షరాలలో 'ఇదే మందులషాపు' అని బోర్డువుంది. లోపల అట్టహాసంగా లైట్లు వెలుగుతున్నాయి. ఒక బట్టతల వ్యక్తి బల్లముందు కూర్చునివుండి, ఉండి ఉండి, ఆవులిస్తున్నాడు. అన్నీ తళ తళలాడే అద్దాల బీరువాలు... వాటిలో అందంగా సర్దబడిన మందులు...బాలరాజు పళ్ళెం అక్కడేవుంచి రెండు అంగల్లో

షాపులోపలికి వెళ్ళి, జేబులోనుంచి మందు కాగితం తీసి అత నికి యిచ్చి "ఎంత అవుతుంది?" అని అడిగాడు. ఆ వ్యక్తి కాగితం మడతలు విప్పుతూనే బాలరాజు వంక ఆసక్తిగా చూశాడు. ఆతర్వాత మళ్ళీ కాగితంలోకి చూసి "రెండూ అరవై పైసలు..." అన్నాడు. ఆమాట అని కాగితాన్ని బల్లమీద పడేశాడు. బాలరాజు అతి జాగ్రత్తగా ఆ కాగి తాన్ని తీసుకున్నాడు. నెమ్మదిగా మడతపెడుతూ "బాగా పనిచేస్తుందా అండీ?" అని అడిగాడు. ఆ వ్యక్తి చేతి వ్రేళ్ళు విరుచుకుంటూ ఆవులింత ఆపుకుని "ఏమో! నాకేం తెలుసు? పనిచేస్తుందేమో! (మళ్ళీ ఆవలింత) లేకపోతే చెయ్యదేమో!" అన్నాడు.

బాలరాజు అద్దాల బీరువాల వంక, లెక్కలేనన్ని రకరకాల ఆమందుల వంక ఒకసారి ఆసక్తిగా చూశాడు. తర్వాత చూపులు తిప్పుకుని నెమ్మదిగా మెట్లు దిగిరా బోయాడు. మందులషాపులో వ్యక్తి "వెళ్ళుతున్నావేం? మందక్కరలేదా?" అని అడిగాడు. బాలరాజు మాట్లాడ కుండా మెట్లు దిగాడు.

తర్వాత వేరుశనక్కాయల పళ్ళెం ముందు కూర్చుని నుదుటిమీద పడుతున్న జుట్టును పైకి తోసుకుంటూ ఉండి పోయాడు. వాడి పక్కనే మరొకడున్నాడు. వాడు నడి వయసువాడు. వాడి పేరు మల్లయ్య. వాడికి దీపం వుంది.

వేరుశనక్కాయల పళ్ళెం ఉంచుకునేందుకు ప్రేముతో తయారుచేయబడిన స్టాండువుంది. అందంగా, చూడముచ్చటగా ముందే తయారుచేయబడిన పొట్లాలున్నాయి. వాడు వేరుశనక్కాయల మీద కవిత్వం కట్టి అరుస్తూ జనాన్ని ఆకర్షించగలడు.

వాడు బాలరాజు వంక చూచి 'ఏరా! మొగం అట్లా ఉందేం ఆరిపోయిన దీపంనాగ..." అన్నాడు.

బాలరాజు బదులు పలకలేదు. మల్లయ్యాకూడా మాట్లాడని వాడితో మనకెందుకని కాబోలు మళ్ళీ ఏమీ అడగలేదు. మల్లయ్య పళ్ళెంలో వేరుశనక్కాయలు తక్కువగా ఉన్నాయి. వాడు సాయంకాలం పెందరాళే బయలుదేరి బ్యారేజీదగ్గర బేరంచూసుకుని యిటువచ్చాడు.

ఇద్దరు మనుషులు బాలరాజు ముందునుంచి నెమ్మదిగా నడిచివెడుతున్నారు. వారిలో ఒకడు, క్రాఫు వెనక్కుదువ్వకున్నవాడు, రెండోవాడితో "ఏరా! ఇవాళ మందు వేసుకుందామా?" అన్నాడు. రెండోవాడు, గడ్డం పెరిగినవాడు, "వేసుకుందాం గాని, నాదగ్గర డబ్బుల్లేవురా..." "నా దగ్గరున్నాయిలేరా రా" అన్నాడు మొదటివాడు, రెండోవాడి భుజంమీద చెయ్యివేసి, ఇద్దరూ హుషారుగా వెళ్ళిపోయారు.

బాలరాజు చిల్లర తీసి అతి జాగ్రత్తగా లెక్క

పెట్టాడు. రూపాయిముప్పయి పైసలున్నాయి. లెక్క పెట్టడం కాగానే మళ్ళీ చిల్లరఅంతా జేబులో పోసుకున్నాడు. మళ్ళీ జాగ్రత్తగా ఎడమవైపు జేబులోనే పోసుకున్నాను కదా' అని చూసుకుని తృప్తిపడ్డాడు. వాడిలాగు కుడివైపు జేబుకు పెద్దకన్నంవుంది.

పోలీసులు ముందుకు నడిచివస్తున్నారు. వారిలో ఒకడు లాఠీఊపుతూ "ఒరేయ్! పొండిరా అవతలికి. ఇక్కడుండ కూడదు..." అన్నాడు.

బాలరాజు పళ్ళెం నెత్తికెత్తుకున్నాడు. మల్లయ్యా కూడా పళ్ళెం నెత్తికెత్తుకుని స్టాండు మరో చేత్తో పట్టుకుని "పదరానాయనా! ఎల్దాం... ఈడనిలబడకూడదంట..." అన్నాడు.

ఇద్దరూ పక్కపక్కనే నడుస్తున్నారు. ఉన్నట్టుండి మల్లయ్యా "ఏరా! మీా అమ్మకు జబ్బుగా ఉందంటివే ... ఎట్టాఉంది ఇయ్యాళ?" అని అడిగాడు.

బాలరాజు "మందిప్పించాల .... సూదిమందు ... డాక్టరు రాసిచ్చాడు. రెండున్నర. యిస్తే తగ్గుద్దంట...." అన్నాడు.

"మరి వేగిరం యిప్పించు" అన్నాడు మల్లయ్యా.

బాలరాజు ఆగాడు. మల్లయ్యావంక చూసి "నువ్వే

సరుకంతా ఏసేసుకుంటావా? నాకు డబ్బుకావాల .... ”
అన్నాడు.

మల్లయ్య సందేహిస్తూ “యియ్యన్నీనా? నేనిచ్చే డేం చేసుకోను ...” అన్నాడు.

బాలరాజు బతిమలాడుతున్న ధోరణిలో “తీసుకో మల్లయ్యా! నీకు ధర్మం అని తోచినంత యియ్యి .... మా అమ్మకు సూదిమందిప్పించకపోతే బతకదేమో ... ” అన్నాడు. వాడి కళ్ళు చర్చిముందున్న లాంతరు వెలుగులో తళతళలాడాయి.

మల్లయ్య స్టాండూ, తన పళ్ళెం, దించుకుని ఆలోచించాడు. బాలరాజు పళ్లెంలో సరుకంతా ఒక్కసారి చూశాడు. తర్వాత “ఎంతియ్యమంటావు?” అని అడిగాడు.

“నీ యిష్టం. యిది రెండు రూపాయల సరుకు .... నీ యిష్టమొచ్చినంతిచ్చి తీసేసుకో .... నేను బేగెల్లిపోతాను.” అన్నాడు బాలరాజు.

మల్లయ్య ఒక్కక్షణం ఆలోచించి “రూపాయి పావలా యిస్తాను తీసుకో....” అన్నాడు.

బాలరాజు “రూపాయన్నర చేసుకో .... లేకపోతే మందురాదు....” అన్నాడు ప్రాధేయపడుతూ.

మల్లయ్య సణుగుతూనే సరుకంతా తన పళ్లెంలో

పోసుకుని సర్దుకుని లోపలి బనీను జేబులోనుంచి ఒక రూపాయి నోటూ, రెండు పావలాబిళ్ళలూ తీసి యిచ్చాడు.

అది అందుకుని బాలరాజు ఖాళీ పళ్ళెం చేతితో పట్టుకుని వేగంగా పరుగెత్తాడు. 'మందుకొట్టు ... మందు కొట్టు' అనుకుంటూ పరుగెత్తాడు.

ఫర్లాంగు దూరం పరుగెత్తేసరికి 'ఇదే మందులషాపు' కనిపించింది. పేదవాడికి పెన్నిధిలా కనుపించింది. పాపాత్ముడికి స్వర్గంలా కనుపించింది. బాలరాజు సుడిగాలిలా మెట్లెక్కి లోపలికి వెళ్ళాడు. వగరుస్తూ, ఆయాసంతో రొప్పుతూ, పళ్ళెం ఒకపక్కన గోడకు ఆనించివుంచి, జేబులోనుంచి మందుకాగితం తీశాడు. దాన్ని మడతలువిప్పి కొట్టువాడి ముందు బల్లమీద పడేశాడు. అయితే ఇందాకటి కొట్లో వలె ఇక్కడ అస్తమానం ఆవులిస్తూ కూర్చున్న కొట్టువాడు లేడు. ఈ కొట్టువాడు సెంటర్లో వాడు. అందువల్ల వాడు ఆవులించడం లేదు. బిజీగా వున్నాడు. ఎదుటనిలబడి వున్న నలుగురైదుగురినీ ఒక్కసారిగా మన్నిస్తున్నాడు. అందర్నీ ఒక్కసారిగా పలకరించి ఒక్కసారిగా వ్యాపారం చేస్తున్నాడు. ఇద్దరు మనుషులు యంత్రాలలాగున లోపలినుంచి ఏవికావాలంటే అవి తెచ్చిఅందిస్తున్నారు.

కొట్టువాడు బాలరాజు పడేసిన కాగితాన్ని దీపం

వెలుగుకు ఎదురుగా విప్పిచూసి, లోపలకి అరిచిచెప్పి, బాలరాజువంకచూసి "ఇమ్మంటావా?" అని అడిగాడు.

బాలరాజు "బేగివ్వండి. ఎంతవుద్ది?" అంటూ చిల్లర డబ్బులు గుప్పిటలో తీసిపట్టుకున్నాడు.

"రెండున్నర" అంటూ కొట్టువాడు మళ్ళీ లోపలి వారి నుద్దేశించి "ఏరా! వెంకూ! తెస్తున్నావా లేదా?" అని అరిచాడు.

లోపలినుంచి ముందు 'వొస్తున్నా' అని సమాధానం వచ్చింది. తర్వాత ఒక బక్క చిక్కిన మానవాకారం చేతిలో మందుతో వచ్చింది. ఆ మనిషి బక్క పలుచని వాడు. మాసిన దుస్తులవాడు. కళాకాంతులు లేనికన్నులూ, లావుపాటి అద్దాలకంటిజోడూ ఉన్నవాడు... పెరిగిన గెడ్డం వాడు...రూపుదాల్చిన అశుభంలా వున్నవాడు... నెమ్మదిగా "ఇదుగో" అని మందు కొట్టువాడికి అందించాడు. కొట్టువాడు "అంత నెమ్మదిగా తగలబడకు, ఇదిగో ఇది తొందరగా తీసుకురా" అన్నాడు మరో మందు చెప్పి.

ఆ మనిషి లోపలికి వెళ్ళిన తర్వాత కొట్టువాడు చెయ్యిచాపాడు. బాలరాజు ముందు రూపాయినోటు తీసి బల్లమీద వుంచి తర్వాత రెండు పావలా బిళ్ళలూ వుంచి, మిగిలిన చిల్లరలోనుంచి మూడు పది పైసల నాణాలు విడి విడిగా తీసుకుని మిగిలిన చిల్లర అంతా అక్కడపోసి 'ఇది

రూపాయి' అన్నాడు. "ఉండుమరి, లెక్క పెట్టుకోనివ్వు." అని కొట్టువాడు రూపాయి చిల్లరనూ లెక్క పెట్టుకోడం మొదలుపెట్టాడు.

బాలరాజు మొహం తుడుచుకున్నాడు. మళ్ళీ తుడుచుకున్నాడు. కళ్ళు నులుముకున్నాడు. మళ్ళీ నులుముకున్నాడు. జుట్టుపైకి తోసుకున్నాడు. మళ్ళీ తోసుకున్నాడు. ఆ పది సెంకడ్లో, పదిహేను సెంకడ్లో పదియుగాలూ, పదిహేను యుగాలవలె గడిచాయి. బాలరాజుకు కాళ్ళూ చేతులూ వొణుకుతున్నాయి. నోరు తడి ఆరిపోతోంది. మరి ఉదయం నుంచీ ఏం తిన్నాడు గనక?

కొట్టువాడు తన వంక చూసి చిల్లర అంతాలోపలికి తోసుకునేదాకా ఆగలేదు బాలరాజు. ఒక చేయిచాపి చిన్న మందు సీసాను పట్టుకున్నాడు. గట్టిగా పట్టుకున్నాడు. రెండో చేత్తో ఖాళీ పళ్లెం అందుకున్నాడు. వేగంగా రెండేసి మెట్లు చొప్పున దిగి రోడ్డుమీద పడి బాణవేగంతో పరుగు తీశాడు. రోడ్డంతా రద్దీగావుంది. కార్లూ, లారీలూ, మోటారు సైకిళ్లూ, సైకిళ్లూ, మనుషులూ, పిల్లలూ, మేకలూ, దూడలూ-ఆవులూ, అన్నీ రోడ్లమీదే వుంటాయి ఈ వూళ్ళో. అందరూ రోడ్లను పార్కుల్లాగా వాడుకుంటారు. చచ్చేవాడు చస్తూవుంటాడు. భూమ్మీద నూకలున్నవాడు ఇంటికి చేరుకుంటూ వుంటాడు.

బాలరాజు రివ్వున పరుగెత్తుతున్నాడు. వాడి కాళ్ళు తేలిపోతున్నాయి. ఒక చేయి మందు సీసా ప్యాకెట్టు చుట్టూ బిగుసుకునివుంది. ఆ చెయ్యి గుండెలకు దగ్గరగావుంది. రెండో చేతిలో ఖాళీ పళ్లెం ... కొందరక్కడక్కడ రోడ్డు మీద ఆగి "ఎవరీ కుర్రకుంక? ఎక్కడైనా, ఏదైనా దొంగతనం చేసి యిలా పారిపోవడం లేదు కదా?" అనికూడా అనుకున్నారు.

బాలరాజు రోడ్లు దాటాడు. కాలువల వంతెనలు దాటాడు. మనుష్యుల్ని దాటాడు. మోటారు బండ్లను దాటాడు. క్లుప్తంగా ఈనాగరిక కీకారణ్యాన్ని దాటాడు. అప్పుడు వాడికి దూరంగా తమ యిళ్లు కనిపించాయి. ఆపేట మొత్తం కనిపించింది. అక్కడి మనుషులు (మనుషులేనావాళ్ళు?) కనిపించారు. మనుషుల మధ్య చనువుగా బురదలో తిరుగాడుతున్న పందులు కనిపించాయి. చల్లని మాతల్లి భూదేవి శరీరంమీద లేచిన భయంకర వ్రణాల్లాగున్న ఆ చిన్నా పెద్దా గుడిసెలన్నీ కనిపించాయి.

బాలరాజు రోడ్డుదిగుతూ జారి పడబోయి తమాయించుకుని మళ్ళీ పరుగెత్తాడు. పాక ముందుకు వచ్చి 'అమ్మా' అని కేక పెట్టాడు. సమాధానం లేదు. తడికె తోసుకుని లోపలికి వెళ్ళి చీకట్లో తడువుకుంటూ అగ్గిపెట్టె తీసి వెలిగించి తల్లి వంకచూశాడు. తల్లి మామూలుగా

కదలకుండా పడుకునివుంది. బాలరాజు పళ్లెం మట్టి గోడకు ఆనించి మళ్ళీ బయటకు వచ్చి రంగయ్యను పిలిచి అతడు యివతలికి రాగానే "నేను సూదిమందు తెచ్చాను మామా! మాయింట్లో దీపం ఎలిగించి ఉంచు. నేను డాక్టరుగారికాడి కెల్లొత్తాను. నర్సునో, ఎవర్నో సూది మందియ్యటానికి పంపిత్తానన్నారుగా!!" అన్నాడు మళ్ళీ పరుగు అందుకుంటూ.

రంగయ్య "అట్టాగే" అని తన పాక తలుపు దగ్గరకి లాగి ఇవతలికి వచ్చి, కొద్దిగా తూలుతూ ఇవతలి పాకలోకి వచ్చి, బొడ్లోనుంచి అగ్గిపెట్టె తీసి, బుడ్డి దీపం వెలిగించాడు. తర్వాత దీపం చేతితో పట్టుకుని మాణిక్యం దగ్గరగా వంగి చూశాడు. అంతలోనే దీపం పక్కన ఉంచి 'ఒరేయ్ రాజూ' అని అరుస్తూ బయటికి వచ్చాడు.

కాని అప్పటికి రాజెక్కడ ఉన్నాడు? రోడ్డెక్కి రివ్వున పరుగెత్తుతున్నాడు. మందు చేతిగుప్పెటలోనే వుంది. చెయ్యి గుండె దగ్గరేవుంది. వాడు నీరసపడిపోతున్నాడేగాని వేగం మాత్రం తగ్గించడంలేదు. వేగంగా మరింత వేగంగా, పరుగెత్తుకు పోతున్నాడు. వాడినెత్తిమీద ఆకాశంలో రెండు నక్షత్రాలు ప్రేమగా చూస్తున్న తల్లి కన్నులవలె దయగా మెరుస్తున్నాయి.

విచిత్రమేమిటంటే, వాడు ఇంతకుముందు పాకలో

అగ్గిపుల్ల గీచి తల్లివంక చూచినప్పుడు వాడికి తల్లి స్పృహలో లేనట్టే కనిపించిందిగాని, వాడు మరి కొంచెం నిదానంగా చూసి వుంటే ఆమె మొహంమీద రెండోవైపు నుంచి పాకుతున్న లెక్కలేనన్ని ఎఱ్ఱచీమల బారులు కనిపించివుండేవి.

*   *   *

అలా ఈ రచయిత చేతిలో మళ్ళీ మరోహత్య జరిగింది. 'అట్లా పాత్రల్ని చంపొద్దు బాబూ' అంటే వినడు. బొత్తిగా వినడు.

ఈ పైన చెప్పబడిన ఉదంతంలో ఈ రచయిత తలచుకుంటే శుభం మాత్రం ఎందుకు జరగదు?

బాలరాజు తల్లిని చూడవచ్చిన ఆ డాక్టరును బతిమిలాడుకుంటే జాలిపడి ఆ రూపాయిన్నరా, వెధవ ముష్టి రూపాయిన్నర, ఆయనే యిచ్చి సాయం చేసేవాడేమో! లేదా కాళ్ళావేళ్ళాపడితే, రంగయ్యా ఇచ్చి ఆదుకునేవాడేమో! అదీ, యిదీ కాకపోతే లోకం గొడ్డుపోయిందిటండీ! ఆకుఱ్ఱ వెధవ 'విషయం యిది' అని చెప్పి ప్రాధేయపడితే రోడ్డుమీద వచ్చేపోయేజనం తలా పైసా సాయం చెయ్యలేకపోయేవారా? లోకంలో ధర్మం యింకా బ్రతికే వుందిగా? పోనీ, ఈ రచయిత కిదొక తెగులు కాకపోతే ఆ కుఱ్ఱకుంక చేత ఆ అమ్మకం ఏదో కాస్తముందుగా

చేయించగూడదూ? అప్పుడాతల్లి బ్రతికేదేమో? ఆఁ! వీడి నెర్రికాకపోతే, వెధవ ఇంజక్షను యివ్వనంత మాత్రంలో చెట్టంత మనిషి ప్రాణం పోతుందా ఏమిటి? ఎందరు రోగాలున్నా, రొచ్చులున్నా, రాళ్ళలా తిరగడంలేదూ?

అయినా వీడే చెప్పాడుగా, చంపేవాడూ చంపేబడేవాడూ అంతా పెద్దమాయఅని? మరిక దిగులెందుకు?